# ప్రేమ

**మా** ఇంటి వారమ్మాయి సుధకి అందముంది. నాకు వయసు ఉంది. చనువు పెరగడానికి సామీప్యత ఉంది. అందుచేత, ఆ ఇంట్లో గదిలో అద్దెకు చేరిన వారం రోజుల్లోనే నేను ప్రేమలో పడ్డాను.

చిక్కొక్కడొచ్చిందంటే, నేను పడ్డట్టే నా రూమ్ మేటు శంబునాథం అనే చెంబుగాడు కూడా ప్రేమలో పడ్డాడు.

'ఒకటే హృదయం కోసమూ, ఇరువురి పోటీదోషము' అన్నారో సినిమా కవిగారు.

దోషమైనా, పాపమైనా మా ఇద్దరికీ పోటీ మొదలైంది ఆ రోజునుంచీ. అయితే పోటీ గురించి నేనేమీ ఆందోళన పడలేదు.

నాకు గిరజాల జుట్టుంది. పచ్చటి ఛాయ ఉంది. యద్దనపూడి సులోచనారాణి గారి హీరోలా యమ పెర్సనాలిటీ ఉంది. బ్యాంకులో ఉద్యోగం ఉంది.

నేను నిజం చెప్పినా కల్పించి చెప్పినట్టుంటుంది కాని, నల్లగా నిగనిగలాడుతున్న గేదెని చూస్తే చెంబుగాణ్ణి చూడక్కర్లేదు.

అందుచేత, కుందేలు తాబేలును చూసి నవ్వినట్టు వాణ్ణి చూసి నవ్వాను. వాడు మాత్రం, పోటీలో నేనూ ఉన్నానురోయ్ అన్నట్లు ప్రయత్నాలు మానలేదు.

'పుస్తకాలేవైనా ఉన్నాయా' అని అడగడానికి మా రూముకొచ్చింది సుధ.

'పుస్తకాలేమిటి?' అన్నాడు చెంబుగాడు తడబడుతూ.

'శ్రీనివాస్ హోటల్లో నేతి పెసరట్టుకీ, జయా కేఫ్ లో ఉల్లి పెసరట్టుకీ పోలికలూ, భేదాల మీద థీసిస్ రాసేసి డాక్టరేట్ కొట్టెయ్యగలడు కాని, కావిలిపాటి విజయలక్ష్మిగారి పేరు వినుండడు వాడు. అంచేత నన్నడగండి' అని ఎటాకిచ్చాను.

సుధ చిరునవ్వు నవ్వింది. ఆ నవ్వు వేడికి చెంబుగాడి మొహమనే పెసరట్టు నల్లగా మాడిపోయింది.

ఆ అమ్మాయిని అలా నవ్వించగలిగినందుకు కొంచెం గర్వపడి, 'ఏం పుస్తకాలు కావాలండి?' అన్నాను.

'ఏవైనా నవలలు...'

'అంటే ఎలాంటివి? యద్దనపూడి సులోచనారాణి గారివా, అరెకపూడి (కోడూరి) కౌసల్యాదేవిగారివా? జొన్నలగడ్డ లలితాదేవి, చిట్టారెడ్డి సూర్యకుమారి, తోటకూర ఆశాలత, పాలకూర సీతాదేవి, లల్లాదేవి, యండమూరి వీరేంద్రనాథ్...' చకచకా లిస్టు చదివేశాను, చెంబుగాడు దంగైపోయి చూస్తుండగా.

'యండమూరి వీరేంద్రనాథ్ అండీ! అన్నట్టు మీరు తులసిదళం చదివారా?'

సుధ అభిమాన రచయిత యండమూరి వీరేంద్రనాథ్ అని స్పష్టంగా తెలిసిపోయింది. అంచేత అటునుంచి నరుక్కువస్తే విజయం తథ్యమని – 'చదవడమా! అసలు తులసిదళం ప్లాటు చెప్పి, ఈ నవల రాయి గురూ అని చెప్పినది నేనే కదా' అన్నాను.

'కాష్మోరా ఎలా ఉంటుందండీ?'

'మన చెంబుగాడికి కొమ్ములు, కోరలు తగిలిస్తే ఎలా ఉంటుందో అలా ఉంటుంది'

మనం ముందుకు వెళ్ళడమే కాదు, శత్రువుని చావు దెబ్బలు కొట్టి రోడ్డు పక్కకి గెంటేయాలన్నది నా ఎత్తుగడ.

చెంబుగాడికి మేం మాట్లాడుకునేదంతా గ్రీక్ అండ్ లాటిన్ లా ఉంది. మా సంభాషణలోకి చొరబడదామా అంటే యండమూరి ఎవరో, తులసిదళం ఏమిటో, కాష్మోరా ఏమిటో, వాడికి తలా తోకా అర్థం కావడం లేదు.

నా మాటలు సుధ మీద అనుకున్న ప్రభావాన్ని కలిగించాయి. ఎంతో ఆరాధనగా నా కేసి చూస్తూ మాట్లాడింది.

ఆ చూపు అర్థం తెలిసిన చెంబుగాడు తలపట్టుకుని కుర్చీలో కూలబడి పోయాడు.

మరునాడే లైబ్రరీలో మెంబరుగా చేరి సుధకి పుస్తకాలు తీసుకు రావడం మొదలు పెట్టాను. రోజూ ఆ అమ్మాయి నా రూముకొచ్చి చెంబుగాణ్ణి పలకరించి

నాతో సాహిత్య చర్చలు చేసేది. ఐ.క్యూ. ఇరవైయైదు దాటని సుధని నా తెలివి తేటలతో ఆకర్షించడం నాకు కష్టం కాలేదు.

అయితే, చెంబుగాడు నా ప్రేమ బండిని పట్టాలు తప్పించేసి పడగొట్టెయ్యాలనే విధ్వంసక చర్యలు మానలేదు. ఒకరోజు సుధ, నేను మామూలుగా సాహిత్య చర్చ సాగిస్తుండగా మొట్టికాయలు తినడానికి మళ్ళీ రంగంలో దిగాడు.

'ఆ రోజు వీడు బెండమూరి భూతేంద్రనాథ్ తెలుసన్నాడు కదా! అదంతా అబద్ధమండి. వీడికి ఆయన తెలియనే తెలియదు' అన్నాడు సుధతో.

'ఒప్పుకుంటున్నాను. నాకు బెండమూరి భూతేంద్రనాథ్ తెలియదు'

చెంబుగాడు సోడాబుడ్డి పగిలినట్లు నవ్వాడు. వాణ్ణి వాడి సో.బు. నవ్వు నవ్వనిచ్చి, ఎఫెక్టు కోసం ఒక క్షణం ఆగి, '... కాని నాకు యండమూరి వీరేంద్రనాథ్ తెలుసు అని బల్లగుద్ది చెబుతున్నాను' అని బల్ల విరగ్గొట్టి మరీ చెప్పాను.

చెంబుగాడు తెల్లమొహం వేశాడు. సుధ కిలకిలా నవ్వింది.

కొంచెంసేపాగి, చెంబుగాడు జేబులోంచి చిన్న కాగితం ముక్క మెల్లిగా లాగి, నేను చూడటం లేదనుకుని గబగబా చదివేసి మళ్ళీ జేబులోకి తోసేసి, నా వైపుకి తిరిగాడు. నేను సుధతో మాట్లాడుతున్నా, ఓరకంట శత్రు కార్యకలాపాలు గమనిస్తూనే ఉన్నాను.

'ఒరే! ఫౌలాడుతున్నావురోయ్' అని వార్నింగిద్దామనుకున్నాను కాని ప్రేమ పరీక్షకి కూడా కాపీలు తీసుకొచ్చే వాడి అజ్ఞానానికి జాలిపడి, ఇప్పుడు మనకొచ్చిన భయం ఏమీ లేదు కదా అని ఊరుకున్నాను.

కాగితం జేబులో తోసేసి, మా ఇద్దరి మధ్య అడ్డుగా నిలబడి చిన్నగా దగ్గి, సుధ తన వేపు తిరగ్గానే, 'నాకు లల్లాదేవి తెలుసు. మా ఊర్లో ఆవిడ, వాళ్ళాయనా అద్దెకుండేవారు' అని మళ్ళీ మొదలు పెట్టాడు.

'ఒక చిన్న సవరణ. లల్లాదేవి ఆవిడ కాదు, ఆయన' అని వివరించాను చెంబుగాడికి.

సుధ మళ్ళీ గలగలా నవ్వింది.

చెంబుగాడు నా చేత రెండు మొట్టికాయలు తినేసి, రెండు చేతులతో తలపట్టుకుని మళ్ళీ కుర్చీలో కూలిపోయాడు.

కాని శత్రువుని తక్కువ అంచనా వేయకూడదని గొప్ప గొప్ప వాళ్ళందరూ చెప్పే దాని అర్థం నాకు త్వరలోనే తెలిసొచ్చింది.

సీరియల్సు, నావెల్సు ఎరువుగా వేసి నేను పెంచుతున్న మా ప్రేమ మూడు పూవులూ, ఆరు కాయలుగా వృద్ధి చెందుతున్న సమయంలో, చెంబుగాడికి దాన్ని మొదలంటా నరికేసే అవకాశం వచ్చింది.

ఒక రోజు సుధ, వాళ్ళమ్మగారు, మేము ఉండగా, వాడు మాటల సందర్భంలో 'మా పాతిక ఎకరాల కొబ్బరితోట' అని చెప్పాడు. మొదట వాడు కావాలని చెప్పలేదు కాని అత్తగారు ఆస్తిపాస్తులు వివరంగా గుచ్చి గుచ్చి అడుగుతుంటే వాడికి వాడి ప్లస్ పాయింటేవిటో తెలిసొచ్చింది. నా మైనస్ పాయింటు కూడా వాడికి అర్థమైపోయింది.

'మా కొబ్బరి డొక్కలు అమ్మితే వచ్చేంత రాదు నెలకి వీడికి' అన్నాడు నన్ను పిలకుచ్చుకుని సంభాషణలోకి ఈడ్చి.

గింజుకుంటే జుట్టు నొప్పి పెడుతుంది కాబట్టి నేను చిరునవ్వు నవ్వుతూ కూర్చున్నాను, పిలక వాడి చేతిలోనే ఉండనిచ్చి.

వాడు మళ్ళీ ఫౌలాడుతున్నాడు.

వాడితో వాదించడం ఇష్టంలేక, తాటికాయలంత అక్షరాలతో, 'ప్రేమ ప్రేమించే హృదయాన్ని కోరుతుంది కాని కొబ్బరి డొక్కలు కోరదు' అని పోస్టరు రాసి చెంబుగాడి మంచం పక్కన గోడకి అంటించాను, వాడికి కనబడేలా.

వాడొచ్చి, పోస్టరు చదివి, పది సోడాబుడ్లు పేలినట్లు నవ్వి, ఎర్రసిరాతో 'గాడిద గుడ్డు' అని రాశాడు దానికింద.

అత్తగారు వాడినీ, నన్నూ తూకం వేసి, వాడికి పచ్చ సిగ్నలిచ్చి నా బండి స్టేషన్లో ఉంచేసిందని నాకు అప్పటికి తెలియదు. ప్రేమ ప్రేమను ప్రేమించడాన్ని ప్రేమిస్తుందని కవి గాళ్ళు రాస్తే, అదే నిజమనుకుని మన దగ్గర ప్రేమ టన్నులకొద్దీ ఉంది కదా, డేంజరు లేదనుకున్నా కాని, నా ఆలోచన తప్పని కొద్ది రోజుల్లోనే తెలిసొచ్చింది.

సుధతో సంభాషణ పుస్తకాలనుంచి సినిమాల వైపు ఎప్పుడు, ఎలా మళ్ళిందో నాకు స్పష్టంగా గుర్తులేదు కాని, చెంబుగాడి ప్రేమ బండి జోడింజన్లు తగిలించుకుని అరకువేలీవైపు పరుగులు తియ్యడం మొదలుపెట్టింది.

ఎందుచేతనో నాకు చిన్నప్పటి నుంచీ సినిమాలు అంటే అంత ఇష్టం లేదు. నాకు సినిమా ఫీల్డుతో అంత పరిచయం లేదు. చెంబుగాడు మాత్రం వచ్చిన సినిమా అల్లా రెండు మూడు సార్లు చూసేస్తాడు. సంభాషణ సినిమాలవేపు మళ్ళినది మొదలు చెంబుగాడు అనర్గళంగా తెలుగు, హిందీ, ఇంగ్లీషు సినిమాల గురించి మాట్లాడటం

మొదలుపెట్టేశాడు. సుధ ఇదివరకులా కాకుండా నన్ను పలకరించి, వాడితో కబుర్లు వేసుకుని, కళ్ళార్పకుండా వాడు చెప్పేది శ్రద్ధగా వింటుండేది.

'దాసరి నారాయణరావూ, నేనూ పాలకొల్లు స్కూల్లో చదువుకున్నాం' అన్నాడు వాడు కౌంటరెటాక్ చేస్తూ.

'నిజంగానా?' అంది సుధ కళ్ళు పెద్దవి చేసి.

సుధ దృష్టిలో నేను ఆరు మెట్లు కిందకు జారిపోయాను, వాడు పన్నెండు మెట్లు పైకి వెళ్ళిపోయాడు.

వాడు అబద్ధం చెబుతున్నాడన్న విషయం సుధకి చెప్పి ప్రయోజనం లేదనిపించింది.

'వాడూ, నేనూ నాటకాలేసేవాళ్ళం. వాడి టాలెంటు నేనే కనిపెట్టి, నువ్వు సినిమాల్లోకి వెళ్ళు గురూ, షైనవుతావు అని చెప్పి పంపించాను' అంటూ గోరుచుట్టు మీద రోకలితో ఇంకో పోటేశాడు.

'అయితే నీ వయసు పాపం, ఏ నలభయ్యో అయి ఉండాలి. దాసరి నారాయణరావు, నువ్వూ చదువుకున్నారు కదూ' అన్నాను నేను.

'వాడు ఫోర్తుఫారం పదేళ్ళు డింకీ కొట్టి ఫిఫ్తుఫారం నాతో చదివాడు. నా వయసు ఇరవై ఐదు. దాసరి వయసు ముప్పయ్యయిదు' అంటూ ఏదో తలా తోకా లేని లెక్క చెప్పాడు.

ఏమైనా, కథలో లాగే తాబేలు కుందేలుని ఓడించే పరిస్థితి వచ్చేసిందని విధి ఒక రోజు నన్నో మొట్టికాయ మొట్టి స్పష్టం చేసింది.

ఆ రోజు నేను చూస్తుండగానే చెంబుగాడూ, సుధా, అత్తగారికి టాటా చెప్పి టాక్సీ ఎక్కి సినిమాకి వెళ్ళబోయారు. నా హృదయం 'అబ్బా' అని మూలిగింది. టాక్సీ కదలబోతుండగా నేను తెలివి తెచ్చుకుని పరిగెట్టికెళ్ళి డ్రైవరు పక్క సీటులో దూకేశాను.

'నువ్వెక్కడికి?' – సుధ వినకుండా నా చెవిదగ్గర మొహం పెట్టి పళ్ళు నూరుతూ అన్నాడు చెంబుగాడు టాక్సీ బయలుదేరాక.

'సినిమాకి'

'సుధా, నేనూ వెడుతున్నాం'

'నేనూ వస్తా'

'సుధా, నేనూ ప్రేమించుకుంటున్నాం'

'నేనూ ప్రేమిస్తున్నాను'

'నువ్వు ప్రేమించడానికి వీల్లేదు. మేం పెళ్ళి చేసుకోబోతున్నాం. వాళ్ళింట్లో కూడా అదే అనుకుంటున్నారు.'

ఇది నిజంగా పతాక శీర్షిక వార్తే. అత్తగారు ఇద్దర్నీ సినిమాకి పంపించడాన్ని బట్టి వాడు చెప్పేది అబద్ధం కాదని స్పష్టమయింది. అయినా మొండిగా అన్నాను దుఃఖంతో, 'మీ పెళ్ళయే దాకా ప్రేమించి తర్వాత సన్యాసుల్లో కలిసిపోతా'.

వాడు సంతృప్తి చెంది 'అప్పుడు నీకెవ్వరూ భిక్షం వెయ్యకపోతే మా ఇంటికొచ్చి భోజనం చేస్తూ ఉండు' అని వెనక్కు వాలి సీటుకి జేర్లబడి, సుధకి కొంచెం దగ్గరగా జరిగి, 'జయసుధకీ, జయప్రదకీ తేడా తెలీని సన్నాసులు సినిమా చూడడం డబ్బు దండగ' అన్నాడు.

సుధ నవ్వింది, స్విచ్చి వేస్తే దీపం వెలిగినట్లు.

నేను ఉక్రోషంతో 'తేడా తెలుసు' అన్నాను.

'వేటగాడు సినిమాలో వేసినది జయప్రదా, జయసుధా?'

'జయప్రద'

'చూశావా వీడి బుర్ర' అన్నట్లు సుధ కేసి తిరిగి సో.బు. నవ్వు నవ్వి, 'జయప్రదా కాదు, జయసుధా కాదు సుబ్బూ! ఆ అమ్మాయిని శ్రీదేవి అంటారు. అయినా వెళ్ళి కాసేపు దెయ్యాలతోనూ, పాములతోనూ మాట్లాడుకోకుండా నీకీ కళాపోషణ ఎందుకు చెప్పు' అన్నాడు హేళనగా.

టాక్సీ మీద పిడుగు పడి వాడు చచ్చిపోయి, సుధా, నేనూ బతికిపోతే బాగుండు ననిపించింది. 'వీడి పెళ్ళి ఆగిపోయేలా చెయ్యి దేవుడా! నీ కొండకొచ్చి గుండు కొట్టిస్తా' అని దేవుడికి మొక్కుకున్నాను.

సుధ పరీక్షలు అయిపోయి కాలేజీకి సెలవులిచ్చేశారు. సెలవుల్లో సుధా వాళ్ళూ ఎక్కడికో బంధువులింటికి వెళ్ళారు. ఆ ఇంట్లో చెంబుగాడూ, నేను మాత్రమే ఉంటున్నాం. మా ఇద్దరి మధ్య మాటలు దాదాపు లేవనే చెప్పొచ్చు. ఏదైనా అత్యవసరమై మాట్లాడాల్సి వస్తే ఏ గోడకో, కుర్చీకో చెబుతున్నాం.

పెళ్ళి అయీ అవగానే నన్ను గదిలోంచి తన్నేయడానికి వాడు కాసుక్కూర్చున్నాడు. వాడో కారణం వలన, నేనో కారణం వలన, క్షణాలు యుగాలుగా లెక్క పెడుతూ సుధ ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నాం.

ఆ రోజు రానే వచ్చింది. నేను ఇంట్లో ఉండలేక పొద్దుటే బయటికి పోయి, తిండి తిప్పలు లేకుండా ఊరంతా పిచ్చి వాడిలా తిరిగి, రాత్రి తొమ్మిది గంటలకు నీరసంగా రూంకి చేరి లైటు వేసి చూస్తే, మంచం మీద చెంబుగాడు గేదెలా పడుకుని ఉన్నాడు, ముసుగెట్టి. నేను లైటు వెయ్యగానే ఒకసారి మూలిగి, మొహం మీంచి దుప్పటి కొంచెం జరిపి, ఒంటికంటితో ఒకసారి నన్ను చూసి మళ్ళీ మూలిగాడు.

'ఏమైంది వీడికి?' అనుకున్నాను కాని అడగలేదు. వాడు చెప్పనూ లేదు. చొక్కా విప్పి హేంగరుకి తగిలిద్దామని తిరిగేటప్పటికి టేబులు మీద ప్లేటు నిండా స్వీట్లు కనిపించాయి.

వాడి ఏడుపుకి కారణం నాకు అర్థమయిపోయింది. వీడు స్వీట్లు తీసుకుని సుధని చూడడానికి వెళ్ళి ఉంటాడు. నెల రోజుల తర్వాత సుధ వీడిని చూసి, 'ఈ గేదెనా నేను ప్రేమించింది' అని ఆశ్చర్యపోయి, తన తప్పు తెలుసుకుని వీణ్ణి తన్ని తగిలేసి ఉంటుంది. వీడు వచ్చి ముసుగెట్టేశాడు.

వాడి పేరు లిస్టులోంచి తీసేస్తే ఇంక ఉన్నది నేనే.

'జై పాతాళ భైరవీ' అని ఓ కేక వేసి, చొక్కా తిరిగి వేసుకుని, ఆకలిమీద ఉన్నానేమో గబగబా లడ్డూలు, మిఠాయి ఉండలు లాగించేస్తూ, 'చాలా బాగున్నాయి' అన్నాను ప్లేటుతో.

చెంబుగాడు 'అయ్యో! అయ్యో!' అని మూలిగాడు.

అవన్నీ తినేసి, గ్లాసుడు మంచినీళ్ళు గడగడా తాగేసి, 'నేను సుధని చూడడానికి వెడుతున్నాను. ఎవరైనా చచ్చి పోయేవాళ్ళు గదిలో ఉంటే బయటికెళ్ళి చచ్చిపోవాలి. ఇంట్లో శుభకార్యం జరగబోతోంది' అన్నాను గ్లాసుతో.

చెంబుగాడు మాట్లాడకుండా లేచి, దుప్పటి కప్పుకుని బయటికి దారి తీశాడు. నేను హుషారుగా కూనిరాగం తీస్తూ బయలుదేరుతుంటే చెంబుగాడు 'అయ్యో! అయ్యో!' అని ఇంకా గట్టిగా మూలగడం మొదలుపెట్టాడు.

సుధా వాళ్ళింట్లో అడుగు పెట్టగానే ఆ ఇంట్లో ఏదో మార్పు వచ్చిందనిపించింది. హాలులో, కుర్చీలో సూటూ బూటూ వేసుకుని గజనిమ్మ పండులాంటి వాడు, చూడగానే 'వీడేరోయ్ విలన్ ఆఫ్ ది పీస్' అనిపించేలా కూర్చుని ఉన్నాడు.

నన్ను చూడగానే 'హలో' అన్నాడు అమెరికన్ ఏక్సెంటులో.

నేను వాడికి ఓ గోంగూర 'హలో' పడేశాను.

'సుద్దూ' అనరిచాడు గ.ని.పండు.

సుద్దూ ఏవిటా అని నేను ఆశ్చర్యపోతుంటే, 'వస్తున్నా' అని నేపథ్యంలో సుధ గొంతు వినిపించి, హాలులో అత్తగారు ప్రత్యక్షమైంది – 'అయ్యో నాయనా! మిమ్మల్నందరినీ పిలుద్దామనుకుంటే టైమే లేకపోయె! అల్లుడుగారు వెంటనే అమెరికా వెళ్ళిపోవాలట. అంతా కలలాగా జరిగిపోయిందనుకో. దాని అదృష్టం...' అంటూ ప్లేటులో స్వీట్లు పెట్టి ఇచ్చింది నాకు.

నా మీద ఆకాశం కూలిపోయింది.

'సుద్దూ' అన్నాడు గ.ని.పండు మళ్ళీ.

'వస్తున్నా' అంటూ పమిట సర్దుకుంటూ వచ్చేసింది సుధ. మెడలో పసుపు తాడు, మంగళసూత్రాలు, ఒంటినిండా నగలు.

'ఎప్పుడొచ్చారు?' అంది నాకేసి తిరిగి, ఏ మాత్రం తడబడకుండా.

'ఇందాకే శంబునాథం గారు వచ్చారు' అని తర్వాత వాళ్ళాయన కేసి తిరిగి, 'ఐ యామ్ రడీ' అంది ఆవకాయ ఫ్లేవరుతో.

వాళ్ళిద్దరూ సినిమాకి వెళ్ళిపోయిన తర్వాత, ఏం చేస్తున్నానో తెలియకుండా లేచి, ప్లేటు పట్టుకుని రూంకి దారి తీశాను. ప్లేటు ధాం అని టేబులు మీద పడెయ్యగానే పక్కన చెంబుగాడి ప్లేటు కనిపించి నేను స్వీట్లు తిన్న విషయం గుర్తుకొచ్చి 'అయ్యో! అయ్యో!' అని మూలిగాను.

'ఎవరైనా చచ్చిపోయేవాళ్ళు గదిలో ఉంటే బయటికొచ్చి చచ్చిపోవాలి' అని అరిచాడు చెంబుగాడు, అరుగుమీంచి లోపలికి తొంగి చూస్తూ.

నేనూ ఒక దుప్పటి భుజం మీద వేసుకుని చెంబుగాడి కెదురుగా అరుగుమీద కూర్చున్నాను.

'మనిద్దరం వెర్రి మొహాలం' అన్నాడు చెంబుగాడు.

'అవును'

హఠాత్తుగా నాకు నా మొక్కు గుర్తుకొచ్చింది. టెక్నికల్‌గా ఆలోచిస్తే, నేను మొక్కు తీర్చక్కర్లేదు. ఎందుకంటే, మొక్కడంలో నా ఉద్దేశం వాడి పెళ్ళాగిపోతే నా పెళ్ళి జరుగుతుందని. కాని కొండమీది గురువుగారు అవన్నీ ఆలోచించరు కదా!

అంచేత, 'నేను రేపు తిరపతి వెడుతున్నాను' అన్నాను చెంబుగాడితో.

ఇంక గోడలతో మాట్లాడాల్సిన అవసరం లేదు కనక మళ్ళీ ఇద్దరం స్నేహితులం అయిపోయాం.

'ఎందుకు?'

'నీ పెళ్ళాగిపోతే గుండు కొట్టిస్తానని మొక్కుకున్నాను'

వాడు ఒక క్షణం ఊరుకుని, 'నేనూ వస్తున్నాను' అన్నాడు.

'ఎందుకు? నువ్వూ మొక్కుకున్నావా?'

'నీ గిరజాల జుట్టు చూసి సుధ ఇష్టపడుతూందనుకుని, వీడికి గుండు చేసేస్తే నీ కొండకి వస్తానని మొక్కుకున్నాను. మరిప్పుడు నువ్వు గుండు కొట్టించేస్తే నేను కొండ కెళ్ళాలి కదా!'

'రైట్' అన్నాను నేను.

సుధని మాలో ఎవరం పెళ్ళాడకపోయినా గుండు మాత్రం ఇద్దరికీ తప్పలేదు.

*(ఆంధ్రప్రభ వారపత్రిక, మే 30, 1984)*